క్లుప్తంగా

ఫర్నీచర్ వితరణ



ఫర్నీచర్ అందజేస్తున్న కోటేశ్వరరావు

కూసుమంచి: మండలంలోని నాయకన్‌గూడెం గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ కార్యాలయానికి గ్రామానికి చెందిన బచ్చు కోటేశ్వరరావు తన తండ్రి నర్సింహారావు జ్ఞాపకార్థం ఫర్నీచర్‌ను వితరణ చేశారు. సోమవారం జరిగిన కార్యక్రమంలో బీరువా, కుర్చీలను పంచాయతీ కార్యదర్శి దామోదర్‌కు అందించగా దాతను పలువురు అభినందించారు. కొమిరెల్లి అలింగ గోవింద రెడ్డి, కంచర్ల సుధీర్‌రెడ్డి, గొల్లపూడి వీరన్న, మారోజు భీష్మాచారి, కంచర్ల రవీందర్‌రెడ్డి, చిలకబత్తిన నాగరాజు, రమేష్ పాల్గొన్నారు.

సన్మానం



హకీంను సన్మానిస్తున్న ఎంపీజే బృందం

ఖమ్మం మామిళ్లగూడెం: ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రభుత్వ డ్రైవర్ల సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు, ఎంపీజే జిల్లా కోశాధికారి ఎండి.హకీమ్ ఇటీవల పదవీ విరమణ పొందిన సందర్భంగా ఎంపీజే ఆధ్వర్యంలో సోమవారం ఖమ్మం సంఘం కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీజే జిల్లా అధ్యక్షుడు షేక్ ఖాసిం, కార్యదర్శులు రజబలి, బొగ్గవరపు సతీష్, రఫీక్, శ్రీనివాస్, బుర్ర వెంకటేశ్వర్లు, మాజీ కార్పొరేటర్లు కనకం భద్రయ్య, దడాల రఘు, మీడియా కన్వీనర్ టీఎస్.చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల ముందస్తు అరెస్టు

రఘునాథపాలెం: ప్రభుత్వ హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ ఉద్యమానికి తరలివెళ్తున్న మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్తలను సోమవారం పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వారిని వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేసినట్టు రఘునాథపాలెం సీఐ ఉస్మాన్ షరీఫ్ తెలిపారు.

ఇందిరమ్మ ఇళ్లకు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న సైదులు

ఖమ్మంఅర్బన్: ఖమ్మం కార్పొరేషన్ 8వ డివిజన్ వైఎస్‌ఆర్ నగర్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు కార్పొరేటర్ లకావత్ సైదులు నాయక్ సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సకాలంలో పనులు పూర్తి చేస్తే విడతల వారీగా లబ్ధిదారుల ఖాతాల్లో నిధులు జమ అవుతాయన్నారు. ఇందిరమ్మ ఇల్లు రాని వారు ఆందోళన చెందొద్దని, ఇది నిరంతర ప్రక్రియ కాబట్టి అర్హులందరికీ ఇళ్లు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు, నివాసులు పాల్గొన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	కిష్కింధపురి
వినోద	కొత్తలోక, డెమాన్ స్లాయర్
సాయిరాం	కొత్తలోక, డెమాన్ స్లాయర్
ఆదిత్య	మిరాయ్
శ్రీనివాస	లిటిల్‌హార్ట్స్

- ఖమ్మంగాంధీచౌక్

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	30	బచ్చలికూర	4
వంకాయ	26		20
బెండకాయ	16	పాలకూర	3
పచ్చిమిర్చి	36		20
కాకర	30	చుక్కకూర	3
బోడ కాకర	120		20
బీర	50	తోటకూర	4
దొండ	40		20
పొట్లకాయ	36	గోంగూర	4
చిక్కుడు	56		20
గోరుచిక్కుడు	46	మెంతికూర	3
క్యాబేజీ	28		20
క్యాలీఫ్లవర్	40	కొత్తిమీర	1
ఆలుగడ్డ	22		40
చామగడ్డ	30	పుదీన	1
క్యారెట్	40		20
బీట్‌రూట్	36	-ఖమ్మం వ్యవసాయం	

రోడ్డు వేయండి మహాప్రభో..

అధ్వానంగా ఆటోస్టాండ్-పంపింగ్‌వెల్ రోడ్డు

- దారి కోసం శివారు ప్రాంతాల ప్రజల ఇక్కట్లు
- ఏళ్ల తరబడి పట్టించుకోవడం లేదని ఆగ్రహం



ప్రధాన రహదారిపై తేలిన గుంతలు



పాత ఫిల్టర్ బెడ్ వద్ద సగం మట్టి తేలిన రోడ్డు

ఖమ్మంక్రైం: రోడ్డు సరిగా లేక.. అవస్థలు పడలేక మాకు రోడ్డు వేయండి మహాప్రభో అంటూ పంపింగ్ వెల్ రోడ్డు వాసులు వేడుకుంటున్నారు. ఖమ్మం పుట్టినప్పుడు ఏర్పడిన పంపింగ్ వెల్‌రోడ్ ప్రాంతం ఇప్పుడు శివారు ప్రాంతంగా మారిపోయింది. దీంతో పాలకులు దీనిపై శీతకన్ను వేశారు. దీంతో ఆ ప్రాంతంలో సుమారు 15 నుంచి 20 ఏళ్ల క్రితం వేసిన రోడ్డు పూర్తిగా మరమ్మతులకు చేరుకున్నాయి. దీంతో పంపింగ్‌వెల్ రోడ్డులోని 30, 34వ వార్డుల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రధాన రోడ్డు రెండు వైపులా కంకర తేలటంతో మధ్యలో బైక్ పట్టే రోడ్డుపై నుంచే కార్లు, బస్సులు సైతం వెళ్తున్నాయి. దీంతో ద్విచక్రవాహనదారులు, పాదచారులు తప్పని పరిస్థితుల్లో రోడ్డు కిందకు దిగి వెళ్తున్నారు.

వర్షం పడితే మరింత దారుణం..

పంపింగ్ వెల్‌రోడ్డులోని ప్రధాన రోడ్డయిన 30, 34వ వార్డుల్లో ఆటోస్టాండ్ నుంచి పాత ఫిల్టర్‌బెడ్ వరకు రోడ్డు అధ్వానంగా తయారైంది. వర్షం పడినప్పుడు దారుణ పరిస్థితి నెలకొంది. పలు మార్లు ప్రజలు రోడ్డు వేయాలని పాలకులు, అధికారుల దృష్టికి తీసుకొచ్చినా పరిస్థితిలో మార్పులేదు. గతంలో కొన్ని స్కూల్ బస్సులు రోడ్డు చివరి వరకు వచ్చేవి. రోడ్డు అధ్వానంగా తయారు కావటంతో రోడ్డు బాగా ఉన్న ఆటోస్టాండ్ వరకు మాత్రమే బస్సులు వస్తున్నాయి. దీంతో ప్రతీరోజు తల్లిదండ్రులు తమ పిల్లలను ఆటోస్టాండ్ వద్దకు వెళ్లి బస్‌లను ఎక్కిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు లేక తమ ఇక్కట్లపై అధికారులు దృష్టి సారించాలని, రోడ్డు వేయాలని స్థానికులు కోరుతున్నారు.

గ్రామాల్లోనే నయం..



పంపింగ్‌వెల్ రోడ్డులో మా ప్రధాన రోడ్డు కన్నా పల్లెటూరులో రోడ్డు బాగుంది. రోడ్డు మీద బైక్ వెళ్లటానికి తప్ప మిగతా రోడ్డంతా గుంతలు పడి దారుణంగా ఉంది. ప్రజలు అంతా ఇబ్బందులు పడుతున్నారు. ఎన్నో ఏళ్ల క్రితం వేసిన రోడ్డే ఇప్పుడు ఉంది. కొన్ని ప్రాంతాలలో రోడ్డంతా పోయి మట్టి మాత్రమే మిగిలింది.

– కూదలి సురేందర్, స్థానికుడు

ఏళ్ల తరబడి ఇబ్బందులు..



ఆటోస్టాండ్ వద్ద నుంచి ఫిల్టర్ బెడ్ వరకు రోడ్డు దారుణంగా ఉన్నా ఎవరు పట్టించుకోవటం లేదు. వర్షం వస్తే గుంతల్లో నీరు నిలిచి విషయం తెలియక చాలా మంది ప్రమాదాలకు గురవుతున్నారు. సందులో ఉన్న రోడ్లు మా ప్రధాన రోడ్డుకన్నా బాగున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు వేయాలి.

– మురజెల్లి శ్రీను, స్థానికుడు

సమస్యల పరిష్కారానికే ప్రజావాణి



ఫిర్యాదు స్వీకరిస్తున్న కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం నగర పాలక సంస్థ పరిధిలో ప్రజలకు తక్షణ పరిష్కారాలను అందించాలనే ఉద్దేశంతో ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య అన్నారు. సోమవారం కొత్త మున్సిపల్ కార్యాలయం, నార్త్‌జోన్-బల్లేపల్లి నార్త్‌జోనల్ కార్యాలయం, సౌత్‌జోన్-పాత మున్సిపల్ కార్యాలయాల్లో ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను స్వీకరించారు. మొత్తం 34 దరఖాస్తులు అందాయి. దీనిపై కేఎంసీ కమిషనర్ సంబంధిత విభాగాధిపతులతో చర్చించి తక్షణ చర్యలను సూచించారు.

జర్నలిస్టులపై అక్రమ కేసులు ఎత్తివేయాలి



అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసనలో జర్నలిస్టులు

ఖమ్మం సహకారనగర్: జర్నలిస్టులపై నమోదు చేసిన అక్రమ కేసులను తక్షణమే ఎత్తి వేయాలని జర్నలిస్టు సంఘాల ఆధ్వర్యాన సోమవారం ఖమ్మం అంబేద్కర్ సెంటర్‌లో నల్లజెండాలతో నిరసన తెలిపారు. టీయూడబ్ల్యూజే(టీజేఎఫ్) ఆధ్వర్యాన జరిగిన ఈ నిరసనకు ఐజేయూ నాయకులు సంఘీభావం పలికారు. ఈ సందర్భంగా టీయూడబ్ల్యూజే(టీజేఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాంనారాయణ, టీజేఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఆకుతోట ఆదినారాయణ మాట్లాడుతూ ఓ టీవీ చానల్ బ్యూరో సాంబశివరావు, కెమెరామెన్ నాగరాజుపై పెట్టిన కేసులను ఎత్తివేయకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. జర్నలిస్టులపై పెట్టిన కేసులు భావ ప్రకటన స్వేచ్ఛను హరించేలా ఉన్నాయని తెలిపారు. టీయూడబ్ల్యూజే(ఐజేయూ) జిల్లా అధ్యక్షుడు ఏనుగు వెంకటేశ్వరరావు, జర్నలిస్టు సంఘాల నాయకులు భూపాల్, మహేందర్, మాటేటి వేణుగోపాల్, కనకం సైదులు, చెరుకుపల్లి శ్రీనివాస్, చిర్రా రవి, అడపాల నాగేందర్, బొల్లం శ్రీనివాస్, ప్రశాంత్‌రెడ్డి, శెట్టి రజనీకాంత్, గుద్దేటి రమేష్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

మద్దులపల్లి మార్కెట్‌కు సౌకర్యాలు కల్పిస్తాం



మాట్లాడుతున్న దయాకర్‌రెడ్డి

ఖమ్మంరూరల్: మద్దులపల్లి మార్కెట్‌ను అన్ని హంగులతో త్వరలో ప్రారంభమఅవుతుందని, రైతుకు ఈ మార్కెట్ ఎంతో ఉపయోగంగా ఉంటుందని మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జి తుంబూరు దయాకర్‌రెడ్డి అన్నారు. సోమవారం మార్కెట్‌లో చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులతో సమావేశం నిర్వహించిన పలు అంశాలను చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మద్దులపల్లి మార్కెట్‌లో పంట ఉత్పత్తుల అమ్మకాలు, కొనుగోళ్లకు అన్ని వసతులు కల్పించటం జరుగుతుందని, జాతీయ రహదారులకు అనుసంధానంగా మార్కెట్‌కు రాకపోకలు సాగించేందుకు సాగర్ కెనాల్‌పై రూ.45 కోట్లతో బీటీ రోడ్డు, కోల్డ్ స్టోరేజీల నిర్మాణాలు చేపట్టడం జరుగుతుందన్నారు. రైతులు మార్కెట్‌ను సద్వినియోగం చేసుకుని పంట ఉత్పత్తులను విక్రయించుకోవాలని కోరారు. ఈ సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బైరు హరినాథ్‌గౌడ్, చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు మెంతుల శ్రీశైలం, మలిశెట్టి వెంకటేశ్వర్లు, గీతా వెంకన్న, ఉప్పల్‌రావు, చెన్నా వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు

హామీ మేరకు పెన్షన్లు పెంచాలి



తిరుమలాయపాలెం: ధర్నాలో దివ్యాంగులు



నేలకొండపల్లి: వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

తిరుమలాయపాలెం: ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు దివ్యాంగుల పెన్షన్ పెంచాలని డిమాండ్ చేస్తూ సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఎదుట దివ్యాంగులు ధర్నా నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో జరిగిన నిరసన అనంతరం అధికారులకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు సురేష్ మాట్లాడుతూ.. పెన్షన్ పెంచకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ధర్నాకు సీపీఎం మండల కార్యదర్శి శ్రీను సంఘీభావం తెలపగా వికలాంగుల హక్కుల పోరాట సమితి మహిళా అధ్యక్షురాలు అజ్మీర భారతి, మండల మహిళా అధ్యక్షురాలు షేక్ సైదాబీ, ఏనుగంటి శైలజ, ఐతరాజు లక్ష్మి, బాలయ్య, వెంకన్న, వంగూరి వెంకన్న వికలాంగులు తదితరులు పాల్గొన్నారు.

నేలకొండపల్లి: పెన్షన్లను వెంటనే పెంచాలని ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జి తోళ్ల సురేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. మాదాసు వెంకన్న, పొట్టపింజర బాలస్వామి, తోళ్ల వెంకన్న, వడ్లమూడి హనుమంతరావు, శ్రీకాంత్ పాల్గొన్నారు.

నిరుపేదలందరికీ ఇళ్లు ఇవ్వాలి



మాట్లాడుతున్న మహ్మద్ సలాం

ఖమ్మంమయూరిసెంటర్/ఖమ్మం మామిళ్లగూడెం: నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు అందేలా చర్యలు చేపట్టాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మొహమ్మద్ సలాం డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక నర్సింహాస్వామి గుట్ట సెంటర్‌లో ఎ.ఉపేంద్రమ్మ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రేషన్‌కార్డులు అందరికీ ఇవ్వాలని, గతంలో రేషన్‌కార్డు ఉన్న వారు పిల్లల పేర్లను నమోదు చేయించడానికి దరఖాస్తులు పెట్టినా ఫలితం ఉండటం లేదన్నారు. జిల్లా కార్యవర్గ సభ్యులు, టూటౌన్ కార్యదర్శి యానాలి సాంబశివరెడ్డి, త్రీటౌన్ కార్యదర్శి నూనె శశిధర్, నర్సింహారావు, ఉపేందర్ యాదవ్, రమణ, రెహమాన్, దుర్గానాథ్, అక్బర్, బేగం పాల్గొన్నారు.

విధుల్లో చేరిన జీపీఓలు

నేలకొండపల్లి: తెలంగాణ ప్రభుత్వం నూతనంగా నియమించిన గ్రామపాలన అధికారులు (జీపీవో)లు సోమవారం విధుల్లో చేరారు. మండలంలోని మొత్తం 15 క్లస్టర్లకు గాను 15 మంది నియమించగా తొలి రోజు 14 మంది తహసీల్దార్ వి.వెంకటేశ్వర్లుకు రిపోర్టు చేశారు. వీరికి తహసీల్దార్ పలు సూచనలు చేశారు. డిప్యూటీ తహసీల్దార్ కనకం నరసింహారావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు ఆలస్యం మధుసూదన్‌రావు, అల్లం రవి తదితరులు పాల్గొన్నారు.

తిరుమలాయపాలెం: మండలంలోని ఆయా గ్రామాలకు నియమితులైన జీపీఓలు సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో రిపోర్టు చేసి విధులలో చేరారు. మండలంలోని 15 క్లస్టర్లకు 15 మంది జీపీఓలను కేటాయించారు. ఆయా క్లస్టర్ల వారీగా జీపీఓల వివరాలు ఇలా ఉన్నాయి. ఈ సందర్భంగా నూతన జీపీఓలు సోమవారం తహసీల్దార్ లూథర్ విల్సన్‌ని కలిశారు.

పార్టీ ప్రయోజనాలకు పెద్దపీట

ఖమ్మం మామిళ్లగూడెం: మార్క్సిజం సైద్ధాంతిక నిబద్ధతతో జీవితాంతం పనిచేసిన నాయకుడు నర్రా రమేష్ అని, వ్యక్తిగత జీవితం కన్నా పార్టీ ప్రయోజనాలకే పెద్దపీట వేశారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ అన్నారు. నాయకులు, మాజీ కౌన్సిలర్ నర్రా రమేష్ సంస్మరణ సభ ఖమ్మంలోని మంచికంటి భవన్‌లో పార్టీ డివిజన్ కార్యదర్శి వై.విక్రమ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకుడిగా, స్టడీ సర్కిల్‌లో క్లాసులు బోధించడంలో మంచి దిట్ట అని కొనియాడారు. నాయకులు భారతి, బండి రమేష్, బండి పద్మా, కళ్యాణం వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు, సుబ్బారావు, జబ్బార్, మీరా సాహెబ్, దొంగల తిరుపతిరావు, నవీన్ రెడ్డి, భుక్యా నాగులు మీరా, బోడపట్ల సుదర్శన్, నాగసులోచన, గోపి, బండారు యాకయ్య పాల్గొన్నారు.

ఘనంగా ఇంజనీర్స్ డే..

ఖమ్మంఅర్బన్: ఖమ్మం నగర పరిధిలోని బొమ్మ ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం ఇంజనీర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ బొమ్మ రాజేశ్వరరావు మోక్షగుండం విశ్వేశ్వరయ్య విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వైస్‌చైర్మన్ సత్యప్రసాద్, కార్యదర్శి ఉదార్ శ్రీధర్ తదితరులు ఉన్నారు.

జీళ్లచెరువులో కృష్ణాష్టమి వేడుకలు



ఉట్టి కొట్టే వేడుకలో భక్తులు

కూసుమంచి: జీళ్లచెరువులోని శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయంలో సోమవారం కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం స్థానిక యువకులు ఉట్టి కొట్టి సందడి చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ముద్రబోయిన నాగలక్ష్మి, ఈఓ జగన్మోహన్‌రావు, జూనియర్ అసిస్టెంట్ మురళి తదితరులు పాల్గొన్నారు.

రేపు రక్తదాన శిబిరం

ఖమ్మం మామిళ్లగూడెం: ప్రధానమంత్రి నరేంద్ర మోడీ జన్మదినంతో పాటు తెలంగాణ విమోచన దినోత్సవం సందర్భంగా రేపు(బుధవారం) ఖమ్మంలోని టీఎన్జీవోస్ ఫంక్షన్ హాల్‌లో మెగా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్టు బీజేపీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సేవా భావంతో రక్తదానం చేయడంతో అనేక మంది ప్రాణాలు రక్షించినట్టేనని, ప్రతీ పౌరుడు ఒక ప్రాణరక్షకుడిగా నిలుస్తారన్నారు. ఈ శిబిరానికి ప్రజలందరూ ముందుకు వచ్చి సేవా కార్యక్రమంలో భాగస్వాములు కావాలని పేర్కొన్నారు.

పంట నమోదు



వివరాలను నమోదు చేస్తున్న ఏఈఓ శ్రీకన్య

కామేపల్లి: మండల వ్యాప్తంగా పంట నమోదు వివరాలను వ్యవసాయశాఖ అధికారులు ముమ్మరంగా చేపడుతున్నారు. సోమవారం మండలంలోని తాళ్లగూడెం, టేకులతండాలో ఏఈఓ శ్రీకన్య పంట నమోదు కార్యక్రమం చేపట్టారు. రైతులు అక్టోబర్ మొదటి వారం లోపు పంట నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నల్లమోతు మురళి, నాగయ్య, వేముల కోటేశ్వరరావు, సపావట్ బాష్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

రిక్రూటర్ పోస్టులకు విద్యార్థుల ఎంపిక



విద్యార్థులతో కళాశాల సిబ్బంది

ఖమ్మం సహకారనగర్: జిల్లా కేంద్రంలోని ఐటీ హబ్ లోని టెక్ స్కై కంపెనీలో రిక్రూటర్ పోస్టులకు విద్యార్థులు ఎంపికైనట్టు కాకతీయ యూనివర్సిటీ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చేకూరి రవికుమార్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఉద్యోగాలకు ఎంపికైన వారిని అభినందించారు. ఇటీవల నిర్వహించిన ఇంటర్వ్యూ తమ కళాశాలలో ఎంబీఏ, ఎంకాం, ఎంఏ ఇంగ్లీష్ చదువుకున్న విద్యార్థులు హాజరుకాగా సదరు పోస్టులకు అర్హత సాధించారన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

ఎల్ఓసీ పంపిణీ

ఖమ్మం అర్బన్: కార్పొరేషన్ పరిధిలోని ఒకటవ డివిజన్‌కు చెందిన సీపీఎం గ్రామ కార్యదర్శి గద్దల జనార్ధన్‌కు మంజూరైన రూ.48 వేల సీఎంఆర్ఎఫ్ ఎల్ఓసీని పార్టీ నాయకులు సోమవారం అందజేశారు. పార్టీ రూరల్ మండల కార్యదర్శి పోరెడు సుదర్శన్ రెడ్డి, ప్రతాపనేని వెంకటేశ్వర్లు, నాయకులు గద్దల పెంటయ్య, గుర్రం కిష్టయ్య, వెంకట్రావు, మధు తదితరులు పాల్గొన్నారు.

పీఎస్ఆర్ ట్రస్ట్‌తో సేవలు విస్తృతం



ఆర్థికసాయం అందజేస్తున్న నాయకులు

నేలకొండపల్లి: పీఎస్ఆర్ ట్రస్ట్ ద్వారా సేవలు విస్తృతం చేస్తున్నట్టు మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయం ఇన్‌చార్జి తుంబూరు దయాకర్‌రెడ్డి అన్నారు. మండలంలో ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సోమవారం బూట్లు పంపిణీ చేశారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. అదేవిధంగా మండలంలో పలు గ్రామాల్లో ఇటీవల మృతిచెందిన వారి కుటుంబాలకు ఒక్కో కుటుంబానికి ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ.10 వేల ఆర్థికసాయాన్ని మార్కెట్ కమిటీ చైర్మన్ వెన్నపూసల సీతారాములు అందజేశారు. కొడాలి గోవిందరావు, రాయపూడి నవీన్, ఆరెకట్ల గురవయ్య, నంబూరి రామారావు, బొందయ్య, వెంకన్న, బచ్చలకూరి నాగరాజు, జెర్రిపోతుల సత్యనారాయణ, మైశా శంకర్, నరేష్, వాకా శ్రీనాథ్, వేగినాటి లక్ష్మీనర్సయ్య, ఏడుకొండలు, మల్లయ్య, పెంటమళ్ల పుల్లమ్మ, వెంకన్న, కొమ్మినేని శ్రీదేవి, వెంకటరెడ్డి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.



59వ డివిజన్‌లో..

ఖమ్మంఅర్బన్: నగరంలోని 59వ డివిజన్‌లో పలు మృతుల కుటుంబాలకు పీఎస్ఆర్ ట్రస్ట్ కింద రూ.10,000 చెక్కులు అందజేశారు. నాయకులు కృష్ణ, బట్టపోతుల సతీష్, ఐతగాని రాఘవ, ఏసీ శ్రీను, రాము, కొండలు, వెంకన్న, వంశీ ఉన్నారు.

నివాళి..

ఖమ్మంఅర్బన్: ఖమ్మం నగర మున్సిపల్ కార్మికుడు, సీపీఎం నాయకుడు మెరిగల పిచ్చయ్య మృతి చెందగా ఆయన మృతదేహాన్ని పలువురు సందర్శించి నివాళులర్పించారు. పార్టీ జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, డివిజన్ కార్యదర్శి వై.విక్రం, హవేలి కార్యాదర్శి దొంగల తిరుపతిరావు, కార్పొరేటర్ కూరాకుల వలరాజు ఉన్నారు.

సాయుధ పోరాటాలను నేటితరానికి వివరించాలి

నేలకొండపల్లి: తెలంగాణ సాయుధ పోరాటాలను నేటి తరం విద్యార్థులకు తెలియజేసేలా పాఠ్యాంశాలలో చేర్చాలని సీపీఐ జాతీయ కమిటీ సభ్యులు భాగం హేమంతరావు కోరారు. తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల్లో భాగంగా సోమవారం మండల కేంద్రంలో నిర్వహించారు. కర్నాటి కృష్ణయ్య స్థూపం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రజకార్లకు వ్యతిరేకంగా చేసిన పోరాటాలతో పేదలు భూములు పంచిన ఘనత కమ్యూనిస్టులదేనన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకటరెడ్డి, కర్నాటి భానుప్రసాద్, కనకబండి సీతారాములు, మారిశెట్టి వెంకటేశ్వరరావు, పాల్తీయ శ్రీనివాసరావు, మమత, కాశిబోయిన అయోధ్య, కుంచం భిక్షం, కృష్ణంరాజు, అబ్దుల్ సత్తార్, కృష్ణయ్య, అనంతు పుల్లయ్య, చెన్నబోయిన మల్లయ్య, మాధవరావు పాల్గొన్నారు.

ఫిజియోథెరపీ క్యాంపు పరిశీలన

కూసుమంచి: కూసుమంచిలోని భవిత కేంద్రంలో సోమవారం ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులకు ఏర్పాటుచేసిన ఫిజియోథెరపీ క్యాంపును ఎంఈఓ బీవీ రామాచారి పరిశీలించారు. విద్యార్థులకు అందజేస్తున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. ఈ కేంద్రం ప్రతీ సోమ, బుధ వారాల్లో పిల్లలకు నిర్వహిస్తున్నందున సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఐఈఆర్పీ కల్యాణి, ఫిజియోథెరపిస్ట్ గోపి నాగలక్ష్మి, సీఆర్పీ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

'డబుల్' ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక

నేలకొండపల్లి: మండలంలోని గువ్వలగూడెంలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల లబ్ధిదారులను ఎంపిక చేశారు. ఏడేళ్ల క్రితం గ్రామంలో నిర్మించిన 30 డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను వివిధ కారణాలతో అసంపూర్తిగా వదిలేశారు. ఈ మేరకు రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సూచన మేరకు అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ సోమవారం లబ్ధిదారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి లబ్ధిదారులను ఎంపిక చేశారు. వారికి లాటరీ పద్ధతిలో ఇళ్ల నంబర్లను కేటాయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలను శర వేగంగా పూర్తి చేసి, ఆదర్శంగా నిలవాలని పేర్కొన్నారు. మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శాఖమూరి రమేష్, మాజీ సర్పంచ్‌లు వంగూరి రాములు, లిక్కి వీరబాబు, కె.పుల్లయ్య, ఉమేష్, అమరనేని రాము తదితరులు పాల్గొన్నారు.

'తాగునీరు రాక నెలయినా పట్టించుకోట్లేదు'



ఖాళీ బిందెలతో ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

తిరుమలాయపాలెం: మండలంలోని కాకవాయి గ్రామానికి మిషన్ భగీరథ నీరు రాక నెలరోజులు గడుస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని సోమవారం గ్రామస్తులు ఖాళీ బిందెలతో పంచాయతీ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. గ్రామంలో నిత్యావసరాలకు కూడా నీరు దొరకక తీవ్ర ఇబ్బందులు పడుతున్నా ఎవ్వరు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. సుబ్లేడు వద్ద పైప్‌లైన్ తెగిపోవడంతో ఈ సమస్య వచ్చిందని, అధికారులు పైపు కనెక్షన్ ఇవ్వకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా స్పందించి నీరు అందించకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ ధర్నాలో సీపీఎం నాయకులు కొత్తపల్లి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.